క్లుప్తంగా

రామాలయంలో యాగశాల ఏర్పాటు



బయ్యన్నగూడెం రామాలయ ప్రారంభోత్సవ సందర్భంగా నిర్మించిన యాగశాల

కొయ్యలగూడెం : బయ్యన్నగూడెం గ్రామంలో నూతన రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాల నిర్వహణకు ఆలయ ప్రాంగణంలో యాగశాల నిర్మించారు. అర్చకులు పెడశనగంటి అప్పారావు ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామచంద్ర సీతా లక్ష్మణ ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ, అదే విధంగా శ్రీ గణపతి లక్ష్మీనరసింహ విగ్రహాలు, కలశ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలు 17వ తేదీ నిర్వహించనున్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారం

దెందులూరు: దెందులూరులో గౌడ, రజక, తొగర, సామాజిక వర్గాల ఉమ్మడి శ్మశాన వాటికల ఆధునికీకరణకు నిధులు మంజూరుకు ప్రాధాన్యతా క్రమంలో కృషి చేస్తానని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో దెందులూరు మండల వైఎస్సార్ సీపీ జగనన్న సచివాలయ మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, వైఎస్సార్ సీపీ బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సప్పా మురళి, రామారావుగూడెం ఉపాధ్యాయులు కాలి రామారావు, రాజులపాటి మధు, పీ. సురేంద్ర తదితరులు ఎంపీ శ్రీధర్‌ను కలిశారు.

జీవన ఎరువులు వాడాలి

దెందులూరు: వరిలో రైతులు ఎరువులు తగిన మోతాదులో వాడాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కే.ఫణికుమార్ అన్నారు. మంగళవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు డీ.భావన, ఎం. శ్వేత, బీ.ప్రమీల, ఎం.లక్ష్మి, ఎస్.గిరిజా ఆధ్వర్యంలో వరి సాగులో మెళకువలు, పరిశోధన కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ వరిసాగులో ద్రవరూప జీవన ఎరువులు వాడటం వల్ల పిలకబాగా పట్టి మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈనె దశలో ఉన్న వరి పంటలో పిలకలను లెక్కిస్తూ రైతులకు జీవన ఎరువులపై అవగాహన అవసరమని అన్నారు. అనంతరం ద్రవరూప జీవన ఎరువుల వాడకంపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు.

రైల్వే ట్రాక్ మరమ్మతులు

భీమడోలు: భీమడోలు రైల్వే ట్రాక్ మరమ్మత్తుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. ట్రాక్ అత్యవసర మరమ్మతులలు నేపథ్యంలో ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు మూసి వేస్తున్నట్లు సంబంధిత రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు చేపట్టిన ట్రాక్ మరమ్మతులను సంబంధిత సాంకేతిక సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీ బుధవారం సాయంత్రం ట్రాక్ పనులు పూర్తి చేసి గేటు మీదుగా వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తారు. ప్రస్తుతం ట్రాక్‌పై బీటీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు కుర్‌ెళ్లగూడెం, పాతూరు రైల్వే గేటుల మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి.

లాన్ టెన్నిస్‌పై శిక్షణ

దెందులూరు: లాన్ టెన్నిస్ విధులు, క్రీడా కౌశలం, వ్యాయామ అధ్యాపక విద్యార్థులకు కీలకమని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నత్తానియేల్ అన్నారు. మంగళవారం కళాశాలలో లాంగ్ టెన్నిస్ ఓరియంటేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్ఐఎస్ కోచ్ కరీముల్లా మాట్లాడుతూ ఉదయం థియరీ, ప్రాక్టికల్ తరగతుల ద్వారా విద్యార్థులందరూ తర్ఫీదు పొందాలని క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయం సాధ్యమన్నారు. వైస్ ప్రిన్సిపల్ పీడీకేడీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ శ్యామల, రమేష్, విజయలక్ష్మి ఉన్నారు.

భీమ నాగలింగేశ్వరుడి వార్షికోత్సవాలు ప్రారంభం

దెందులూరు: గాలాయగూడెంలో భీమ నాగలింగేశ్వరస్వామి 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు వివిధ పుష్పాలతో విశేషాలంకరణ చేశారు. ఆలయ ప్రదక్షణ నిర్వహించి స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామివారి కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు.

'గోరుముద్ద'పై సంతృప్తి

దెందులూరు: జగనన్న గోరుముద్ద విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకమని సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, వైస్ సర్పంచ్ ఏనుగు హేమ సాగర్ అన్నారు. మంగళవారం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం స్వర్ణలత, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌తో పాటు జగనన్న గోరుముద్దను విద్యార్థులతో కలిసి వారు రుచి చూశారు. నాణ్యత, రుచి పట్ల ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేసి ఉపాధ్యాయులను అభినందించారు.

ఆరునెలలకొకసారి ఆల్బెండజోల్



బయ్యనగూడెంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం అరుంధతి పేట పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్న ఎంపీడీవో ఎం.శ్రీహరి



టి.నరసాపురంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ అందిస్తున్న దృశ్యం



చింతలపూడిలో డీవార్మింగ్ మాత్రలు అందజేస్తున్న వైద్యులు కిరణ్ చైతన్య

- జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- విద్యార్థులకు మాత్రల పంపిణీ

కొయ్యలగూడెం : నులిపురుగులతో విద్యార్థుల ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుందని బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.విజయకృష్ణ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పరిషత్ మెయిన్ స్కూల్‌లో విద్యార్థులచే మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో 30 శాతం మంది పిల్లలు నులిపురుగుల వల్ల కలిగే వివిధ రకాలైన రుగ్మతలతో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యంగా రక్తహీనత, ఆకలి లేకపోవడం, నీరసం, బద్ధకంగా ఉండటం వంటి లక్షణాలతో ఉంటారని కనుక వీటిని నివారించాలంటే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. భోజనానికి ముందు, మలవిసర్జన తరువాత సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. పరిశుభ్రమైన ఆహార పదార్థాలను మాత్రమే తినాలని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరు ఈ మాత్రలు వేసుకోవచ్చు అని పేర్కొన్నారు. బయ్యనగూడెం ఆరోగ్యకేంద్రం పరిధిలోని 30 పాఠశాలలు, 31 అంగన్‌వాడీ సెంటర్లలోని 6,023 మంది పిల్లలకు మాత్రల పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.కె.జ్యోత్స్నదేవి, ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.రమేష్, ప్రధానోపాధ్యాయురాలు జీపీ మంగతాయారు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

బుట్టాయగూడెం : దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యాధికారి ఏఎస్‌వీ ప్రవీణ్ దొరమామిడి గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్యురాలు ఎస్.నందిని తెల్లంవారిగూడెం బాలికల ఉన్నత పాఠశాలలో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరించారు. ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దొరమామిడి పీహెచ్‌సీ పరిధిలో 30 పాఠశాలలో 1,547 మంది విద్యార్థులకు 1,530 మందికి, 28 అంగన్‌వాడీ సెంటర్లలో 595 మందికిగాను 572 మంది విద్యార్థులచే నులిపురుగుల నివారణ మాత్రలను మింగించినట్లు వివరించారు. మిగిలిన పిల్లలకు 18వ తేదీన డీవార్మింగ్ చేయడం జరుగుతుందన్నారు. బుట్టాయగూడెం అరుంధతి పేట పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీహరి పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు.

టి.నరసాపురం: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మండలంలో నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 1 నుంచి 19 ఏళ్ల చిన్నారులు, కిషోర బాల బాలికలచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. టి.నరసాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని, తద్వారా విద్యార్థులు చదువులో ఆసక్తి చూపించలేక వారి భవిష్యత్తు ఇబ్బందిగా మారుతుందని, కావున ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ తీసుకోవాలన్నారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులచే ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 18న అందిస్తామన్నారు.

చింతలపూడిలో...

చింతలపూడి : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. రాఘవాపురం పీహెచ్‌సీ వైద్యులు డా.కిరణ్ చైతన్య మాట్లాడుతూ డీవార్మింగ్ మాత్రల వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని అపోహలు పెట్టుకోవద్దని చెప్పారు. మండలంలో 15,206 మంది పిల్లలకుగాను 97 శాతం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 18న పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. డాంగే నగర్ సచివాలయ ఏఎన్ఎం సుదీప, ఆశ వర్కర్ సుబాంబి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని, తద్వారా నులిపురుగుల నుంచి వచ్చే ఇబ్బందులను నివారించవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వి.హనుమంతరావు, సభ్యులు జి.వెంకట్‌లాల్, టి.ఝాన్సీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డీ వార్మింగ్ డే నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులు రాజకీయాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కళాశాల అధ్యాపకులు

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ధారావతు మల్లేష్ అధ్యక్షతన 'భారతదేశ అభివృద్ధికి స్థానిక ప్రభుత్వాల పాత్ర ' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే మంచి ప్రభుత్వాలు అవసరమని అన్నారు. దేశ అభివృద్ధి కోసం విద్యార్థులు భవిష్యత్తులో రాజకీయాల్లో రాణించాలన్నారు. నిడదవోలు, ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు ఎం.పద్మజ మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి నియమించిన వివిధ కమిటీల గురించి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు దేశానికి పట్టు కొమ్మలు వంటివి అని, వాటి అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్, వి.శ్రీనివాస్, ఎం.హర్షవర్ధిని, నజ్మా పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



సీతానగరం గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులు

చింతలపూడి : సీతానగరం గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. అక్రమంగా బదిలీ చేసిన యూనియన్ ఆఫీస్ బేరర్ల బదిలీలను రద్దు చేసి స్థానికంగా కొనసాగించాలని, కార్మికులు, ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేస్తూ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్నారు. ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన ఇంక్రిమెంట్లు, జీతాల పెరుగుదల విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంబిస్తున్న నిరంకుశ వైఖరి విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్ డిమాండ్ చేశారు. 2012 నుంచి కార్మిక చట్టాలను అమలు చేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. గోద్రేజ్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు ఆర్‌వీ సత్యన్నారాయణ, మొడియం నాగమణి, సాయికిరణ్, మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కులో మౌలిక వసతులు కల్పించండి



పార్కుకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్న ప్రజలు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్‌కు మంగళవారం కమిషనర్ పి.భవానీ ప్రసాద్ విచ్చేసిన సందర్భంగా పార్క్‌లో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు, సీనియర్ సిటిజన్లు కోరారు. పార్క్‌లో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకటి పడితే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పార్కుకు వచ్చిన వారికి దాహార్తిని తీర్చేలా మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సమస్యను మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ నరసింహరాజు, క్షత్రియసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

17 నుంచి నూకాలమ్మ జాతర



జంగారెడ్డిగూడెం శ్రీ నూకాలమ్మ అమ్మవారు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ వార్షిక జాతర మహోత్సవాలు ఈనెల 17 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రాజాన సత్యనారాయణ తెలిపారు. జాతర కార్యక్రమాలను మంగళవారం ఆలయ కమిటీ వెల్లడించింది. 17న కలశ స్థాపన, గరగలు తీయడం, గంగానమ్మ ఆలయం నుంచి 1008 ముత్తయిదువులతో శోభాయాత్ర, 18న 108మంది మహిళలతో శ్రీచక్ర నవావరణ పూజ, సాయంత్రం అమ్మవారిని మాడవీదుల్లో ఊరేగింపు, 19న సరస్వతి పూజా, 20న అమ్మవారిని స్వర్ణవర్ణ కవచాలంకృతం చేసి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు, గ్రామోత్సవం, 21న అమ్మవారికి 108 స్వర్ణపుష్పాలతో అర్చన, 22న ద్వారకాతిరుమల బ్రహ్మశ్రీ డాక్టర్ భమిడిపాటి వెంకట లక్ష్మీ నారాయణ శర్మచే పంచాంగ శ్రవణం, 23న సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం శివపార్వతుల కళ్యాణం, 24న అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 11 గంటల నుంచి అఖండ అన్నసమారాధన, 25న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా ఆలయంలో ప్రతీ రోజు నిత్యపూజలు, లలితా విష్ణు సహస్రనామ పారాయణలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

17న శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామి రాక

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవ కార్యక్రమంలో శ్రీసాయి దత్త నాగానందసరస్వతి స్వామి పాల్గొననున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు రాజాన సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 59వ ఉగాది వార్షిక జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా తొలిరోజు 1008 మంది ముత్తైదువులతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. ఈ శోభాయాత్రను నాగానంద సరస్వతి స్వామి ప్రారంభిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం 7 గంటలకు ఆయన భక్తులనుద్దేశించి ప్రవచనాలు చెబుతారన్నారు. నాగానంద సరస్వతి స్వామికి స్వాగతం తెలిపేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వివాద స్థలంలో ఆక్రమణల తొలగింపు



వివాదాస్పద స్థలం నుంచి ఆక్రమణదారులను తొలగిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఆర్ఎస్ నెంబర్ 449లో స్థల వివాదానికి సంబంధించి పోలీసు, రెవెన్యూ అధికారులు 145 సీఆర్‌పీసీ చట్టాన్ని అమలు చేశారు. సదరు స్థలాన్ని ఆక్రమించి టెంట్ వేసిన వ్యక్తులను అధికారులు ఆ స్థలం నుంచి మంగళవారం ఖాళీ చేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొయ్యలగూడెంకు చెందిన చిన్నం కోటేశ్వరరావుకు జంగారెడ్డిగూడెంలోని ఆర్ఎస్ నెంబర్ 449లో 5 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలాన్ని కొందరు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించారని, తనకు న్యాయం చేయాలని కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సై సాగర్‌బాబు, శాంతిభద్రతల దృష్ట్యా ఈ కేసును మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, తహసీల్దార్‌కు బదిలీ చేశారు. దీంతో ఈనెల 16న సంబంధిత పత్రాలతో తహసీల్దార్ కోర్టుకు హాజరుకావాలని ఇరువర్గాలను ఆదేశించారు. అంత వరకు సదరు వివాద స్థలంలో ఎవరూ ప్రవేశించరాదని 145 సీఆర్‌పీసీ అమలు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎస్సై ఎం.సాగర్‌బాబు ఆధ్వర్యంలో ఏఎస్సై ఉమామహేశ్వరరావు, హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి, పీసీ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కె.రమేష్, ఆర్ఐ పి.కమల, వీఆర్‌వోలు బాజీ, రాంబాబు, భవానీ ఆ స్థలంలో టెంట్‌లు వేసి ఉంటున్న వ్యక్తులను అక్కడి నుంచి పంపించి వేసి, టెంట్‌లను తొలగించారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఎవరూ స్థలంలోకి ప్రవేశించరాదని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

నిబంధనల మేరకు వాహనాలు నడపాలి



ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించిన వాహనాలు

జంగారెడ్డిగూడెం : వాహనాలను నిబంధనల మేరకు నడపాలని ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణ అన్నారు. పట్టణంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆదేశాల మేరకు సీఐ పి.బాలసురేష్‌బాబు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై పి.రామకృష్ణారావు ఈ తనిఖీలు చేశారు. హెల్మెట్ లేకుండా, త్రిబుల్ రైడింగ్ చేస్తూ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నవారి నుంచి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు జరిమానా విధించడంతో పాటు, హెల్మెట్ లేనివారితో హెల్మెట్ కొనుగోలు చేయించారు. ఎస్సై రామకృష్ణారావు మాట్లాడుతూ ఈ డ్రైవ్‌లో 10 మందికి జరిమానాలు విధించి, హెల్మెట్‌లు కొనిపించినట్లు తెలిపారు. వాహనదారులు వాహన రికార్డులు వెంట ఉంచుకోవాలని, హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాన్ని నడపరాదన్నారు. త్రిబుల్‌రైడ్, మొబైల్ మాట్లాడుతూ, మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా మైనర్‌కు వాహనాలను ఇవ్వరాదన్నారు. అలా చేస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పూర్తిగా నిషిద్ధమని, ఎవరైనా పట్టుబడితే చర్యలు తప్పవన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

చింతలపూడి : నియోజకవర్గంలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడానికి పటిష్ట ఏర్పాట్లు చేశారు. చింతలపూడిలో ఇంటర్ పరీక్షల కోసం 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. లింగపాలెం, చింతలపూడి, టి నరసాపురం మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన మొత్తం 1,025 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, విజేత జూనియర్ కళాశాల, అర్పణ కళాశాలలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లోని కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానం చేశారు. పరీక్షలు జరిగే విధానాన్ని రాష్ట్రంలోని ఎక్కడి నుంచి అయినా ఉన్నతాధికారులు పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

కొయ్యలగూడెం: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం సిద్ధం చేసింది అని కస్టోడియన్ ఏ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, వీఎస్ఎన్, అపోలో కళాశాలలో విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. సుమారుగా 700 మంది వరకు విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు

భీమడోలు: డ్వాక్రా సంఘాల నిర్వహణ రికార్డులు సక్రమంగా లేని పక్షంలో సహించేది లేదని డీపీఎం (ఐబీ) ఈ.అనిత అన్నారు. భీమడోలు వైఎస్సార్ క్రాంతిపథం మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండలంలోని గ్రామ సంఘాల ప్రతినిధులకు నిధుల వినియోగపు రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణపై వచ్చే నెల వార్షిక ఆడిట్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా అధికారుల బృందం రికార్డుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎం పి.సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. డీపీఎం (ఐబీ) ఈ.అనిత, డీపీఎం (ఫైనాన్స్), పార్థసారథి, ఏపీఎం (ఐబీ) ఏసురత్నం రికార్డులను పరిశీలించి లోపాలను సరి చేసుకోవాలని పలు సూచనలందించారు. ప్రతి పైసాకు ఆడిట్‌లో లెక్క చూపాల్సిన బాధ్యత గ్రామ సంఘాల ప్రతినిధులు, సీసీలపై ఉందన్నారు. డ్వాక్రా సంఘాల పనితీరును సూచించే ఆడిట్‌లో లోపాలు లేకుండా రికార్డులను సరి చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 45 సంఘాల పరిధిలో 1,759 డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సీసీ సిబ్బంది, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు జాబితా ప్రదర్శన

ఉంగుటూరు: ఈ- పంట నమోదు జాబితాలో అభ్యంతరాలు ఉంటే రైతులు ఈనెల 19 లోపు ఆర్‌బీకేలలో తెలియజేయాలని మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు, నాచుగుంట, నీలాద్రిపురం కాగుపాడు, కైకరంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఆయన ఈ పంట నమోదు జాబితాలు వెల్లడించి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమావేశాలు ఏర్పాటు చేశారు. ఉంగుటూరు ఏఏ జాన్సి, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.